ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- బకాయిలు ఇవ్వకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తాం
- బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

అభివాదం తెలుపుతున్న జాన్‌వెస్లీ, జె శ్రీనివాస్ గౌడ్, మధుసూదనాచారి తదితర నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చేపట్టే కార్యక్రమాల్లో సిపిఎం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం బిసి విద్యార్థుల సమర శంఖారావం మహాసభను సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ఏ ఉద్యమమైనా విద్యార్థులతోనే మొదలవుతుందని చెప్పారు. ప్రస్తుతం కనీసం విద్యార్థులకు నాణ్యమైన చదువు అందడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.నాలుగు వేల కోట్లు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేల సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల వారు అణచబడుతూనే ఉన్నారన్నారు. పేద విద్యార్థులు తిరగబడాల్సిన సమయం ఆసన్నమైందని, పూలే, అంబేద్కర్ ఆశయాలను సాధించడానికి, పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్‌సి, ఎస్‌టిల మాదిరిగా బిసి విద్యార్థులకు పది వేల ర్యాంకు నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లోనూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే తమ పార్టీ తరపున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాల విధానాల వల్ల నిరుద్యోగం పెరిగి పేద విద్యార్థులు బతుకులు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు అడ్డా కూలీలుగా ఆటో రిక్షా కార్మికులుగా పని చేస్తున్నారని ఆందోళన చెందారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసి నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు చేస్తున్న పోరాటానికి తమ పార్టీ సంపూర్ణంగా మద్దతిస్తుందని చెప్పారు.

ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలు కాకుండా విద్యార్థుల హక్కుగా చూడాలన్నారు ఫీజురీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల నిరంతర ప్రక్రియగా కొనసాగాలి కానీ ముఖ్యమంత్రి జేబు నుంచి ఇచ్చినట్టుగా చూడొద్దన్నారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఫీజుల బకాయిలు విడుదల చేయాలని అడుగుతుంటే ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు మాత్రం వేల కోట్ల రూపాయలు రాత్రికి రాత్రే విడుదల చేస్తోందని ఆరోపించారు. వారం పది రోజుల్లో మొత్తం ఫీజుల బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే విద్యార్థులతో సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం, కురుమ బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్‌చారి, బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి మనిమంజరి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యా సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహనాయక్, బిసి యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఘన వారసత్వానికి నవ తేజస్సు

- నేడు ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణానికి సిఎం భూమి పూజ
- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మాణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వైద్యారోగ్య చరిత్రలో మరో కొత్త శకం ప్రారంభం కానుంది. వందేళ్లుగా తెలంగాణతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు సేవలందించిన ఉస్మానియా నూతన ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉస్మానియా ఆసుపత్రి అఫ్జల్ గంజ్‌లో ఉండగా,నూతన ఆస్పత్రిని గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్నారు. నూతన ఆస్పత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేయనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో మొత్తం 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆసుపత్రిని నిర్మించనున్నారు. 26 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ నూతన ఆస్పత్రిని కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పూర్తి వసతులతో...

రాబోయే వందేళ్ల అవసరాలకు తగినట్లు నూతన ఆస్పత్రిని నిర్మించాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా.. అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒకే చోట అన్నిరకాల డయాగ్నసిస్ సేవలు,అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మార్చురీ, స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఫెసిలిటీస్ కూడిన ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్లకు రూపకల్పన చేశారు. అలాగే అండర్ గ్రౌండ్ రెండు ఫ్లోర్లలో పార్కింగ్, ఆస్పత్రి సమీపంలో ఫైర్ స్టేషన్, ఆసుపత్రి చుట్టూ విశాలమైన రహదారులు, ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడికైనా ఫైర్ ఇంజిన్లు, అంబులెన్స్‌లు తిరిగే మార్గాలు, దివ్యాంగులు ఆస్పత్రిలోకి రాకపోకలు సాగించేందుకు వీలుగా ర్యాంప్‌లు, ఆస్పత్రిలోని రోగులకు సహాయకులుగా వచ్చే వారు సేద తీరేందుకు డార్మెటరీలు, క్యాంటీన్, మరుగుదొడ్లు నిర్మించనున్నారు.

పాఠశాల విద్యలో ఎఐ ఆధారిత డిజిటల్ విధానం

- విద్యా ప్రమాణాల పెంపునకు కృషి
- నందన్ నీలేకని 'ఏక్ స్టెప్- ఫౌండేషన్' సేవలు
- విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా నేతృత్వంలో బెంగళూరులో పర్యటన

బెంగుళూరులో ఏక్ స్టెప్- ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపునకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత డిజిటల్ విద్యను విద్యార్థులకు అందించాలని నిర్ణయించింది. ఎఐ వినియోగించడం ద్వారా పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో పాఠశాల విద్యను మరింత నాణ్యతా ప్రమాణాలతో అందించడానికి ఏఐ, డిజిటల్ ఇనీషియేటివ్‌లను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని భావిస్తున్నది. విద్యార్థుల్లో మరింత మెరుగైన అభ్యాస పద్ధతులను, సాంకేతిక ప్రమాణాలను పెంపొందించడం లాంటి వినూత్న కార్యక్రమాలను ప్రవేశ పెట్టాలని సమాలోచన చేస్తున్నది. దీనిలో భాగంగా బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న 'ఏక్ స్టెప్ -ఫౌండేషన్'ను తెలంగాణ విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా నేతృత్వంలో ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. ఈ ప్రతినిధి బృందంలో ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇవి నరసింహారెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్లు ఉమా హారతి, గరిమ తదితరులున్నారు. విద్యారంగంలో డిజిటల్ పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థుల్లో విద్యా పరమైన నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడంలో ఏక్ స్టెప్- ఫౌండేషన్ అగ్రగామిగా ఉన్నది. ఆ ఫౌండేషన్ - విజనరీ టెక్నోక్రాట్, ఫిలాంత్రపిస్ట్, ఇన్ఫోసిస్ కో-ఫౌండర్ అయిన నందన్ నీలేకని ఈ ఏక్ స్టెప్-ఫౌండేషన్‌కు కో-ఫౌండర్‌గా కూడా ఉన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాల్లో డిజిటల్ పద్ధతులను ప్రవేశపెట్టి మరింత మెరుగైన సేవలను అందించడానికి ఈ ఏక్ స్టెప్-ఫౌండేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఇది ఇప్పటికే గుజరాత్, కర్ణాటక, ఒడిశా, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలలో ఆయా ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నది.

ఏక్ స్టెప్ ఫౌండేషన్ ప్రతినిధులతో విద్యాశాఖ బృందం భేటీ

గురువారం బెంగుళూర్‌లో ఏక్ స్టెప్- ఫౌండేషన్ ప్రతినిధులతో తెలంగాణా విద్యాశాఖ ప్రతినిధి బృందం భేటీ అయ్యింది. విద్యారంగంలో చేపట్టాల్సిన పలు అంశాలపై చర్చించింది. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), ప్రాథమిక విద్యా స్థాయిలో ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ఆధారిత డిజిటల్ పద్ధతుల ద్వారా ప్రాథమిక స్థాయిలో రాయడం, చదవడం, సంఖ్యాపరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం పై మాట్లాడారు. ఏఐ ఆధారిత టూల్స్, ప్లాట్‌ఫామ్‌లను ప్రవేశ పెట్టడం ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిగత స్థాయిలో విద్యా ప్రమాణాలు, అభ్యాస పద్ధతులను మరింతగా మెరుగుపర్చడం పై దృష్టిసారించాలని చర్చించారు. విద్యార్థుల్లో ఉన్న అభ్యసన లోపాలను గుర్తించి, వాటిని సవరించడానికి తగు ఇనిషియేటివ్‌లని ప్రవేశ పెట్టాలని మాట్లాడారు. ఉపాధ్యాయుల్లో వృత్తిపరమైన ప్రమాణాలను పెంపొందించడం, పాఠశాల గదుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్ధవంతంగా ఉపయోగించడానికి వారికి డిజిటల్ పద్ధతులపై పూర్తి స్థాయిలో శిక్షణ అందించాల్సిన అవసరముందని అభిప్రాయానికి వచ్చింది. ఏక్ స్టెప్ -ఫౌండేషన్‌ను సందర్శించిన విద్యాశాఖ ప్రతినిధి బృందం గతేడాది కేరళను సందర్శించింది. అక్కడి విద్యారంగంలో చేపట్టిన ఆధునిక పద్ధతులను పరిశీలించింది. కేరళ ప్రభుత్వం కూడా విద్యాశాఖలో ఏఐ టూల్స్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకుని మెరుగైన విద్యా ప్రమాణాలను సాధించిందని ఈ బృందం పరిశీలనలో గుర్తించింది. ఈ ఉత్తమ పద్ధతులను కూడా తెలంగాణా విద్యాశాఖలో ప్రవేశపెట్టాలని అధికారులు నిర్ణయించారు. ఏక్ స్టెప్ -ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏఐ ఆధారిత విద్యను ప్రవేశ పెట్టడానికి తెలంగాణ సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నారు. డిజిటల్ ఇనీషియేటివ్స్, ప్రాథమిక స్థాయిలో అభ్యసన నైపుణ్యాల పెంపు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్నేహపూర్వక అభ్యసన పద్ధతుల్లో సహాయం అందించడం వంటి రంగాల్లో ఈ ప్రణాళికను అమలు చేయాలని భావిస్తున్నారు.

రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోసం అధిష్టానానికి ముగ్గురి పేర్లు
- ఇష్టాగోష్టిలో మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రిజర్వేషన్ల పెంపుదల తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలుంటాయని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. కులగణన నివేదికపై ఫిబ్రవరి 5న మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదనే అంశంపై స్పందించిన ఆయన... క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారుల వైఫల్యం కారణంగానే కొంతమేరకు పథకాలు లబ్ధిదారులకు అందడం లేదని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల జాబితాను పార్టీ అధిష్టానం వద్దకు పంపించామని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఇష్టాగోష్టిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ బలోపేతం కోసం గ్రేటర్‌పై దృష్టి సారించామని చెప్పారు. అత్యధిక సీట్లు గెలిచి మేయర్ పీఠం మరోసారి కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి తెచ్చిన నిధులెన్ని, ప్రాజెక్టులెన్ని చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి కార్పొరేటర్లు బిక్షాటన చేయడం సిగ్గు చేటన్నారు. ఆ పరిస్థితి ఎందుకొచ్చిందని ఆయన ప్రశ్నించారు. గాంధీ కలలు కన్న సమానత్వం కోసం పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీలు కులగణనను అడ్డుకోవాలని చూసినా దాన్ని పూర్తి చేశామన్నారు. బిఆర్‌ఎస్ హయాంలోనే రియల్ ఎస్టేట్ పడిపోయిందని గుర్తు చేశారు. దానిని తమ ప్రభుత్వం గాడిన పెడుతుందని చెప్పారు. కులగణన స్వతంత్ర భారతదేశంలోనే చరిత్రాత్మకమని తెలిపారు. బిజెపి మాదిరిగా హామీలు అమలు చేయకుండా వదిలివేయబోమని స్పష్టం చేశారు. కొంత ఆలస్యమైనా ఒక్కొక్క హామీ అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి ఇప్పటికే ముగ్గురు అభ్యర్థుల పేర్లను అధిష్టానానికి పంపించామన్నారు. తుది నిర్ణయం త్వరలో ప్రకటిస్తుందన్నారు. అన్ని సౌకర్యాలున్న పాత సెక్రటేరియట్‌ను కేసీఆర్ ఎందుకు కూల్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమయాభావం దృష్టిలో పెట్టుకొని సిసిసి, సిఎం నివాసంలో సమీక్షలు చేస్తున్నారని, అందులో తప్పేముందని వివరించారు. రాహుల్ గాంధీ సభ ఫిబ్రవరి రెండోవారంలో సూర్యాపేట జిల్లాలో నిర్వహించబోతున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారిక నివాసంలో సిఎం ఫోటోతోపాటు రాహుల్, సోనియాగాంధీ, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే ఫోటోలను ముద్రించాలని సూచించారు. పదేండ్లుగా కేసీఆర్ పరిపాలను గాడిన పెట్టలేకపోయారని స్పష్టం చేశారు. వైఎస్‌ఆర్‌కు ఉన్నంత అభిమానులు ఎవ్వరికి లేరని తెలిపారు. పదేండ్లలో కేసీఆర్ చేసిన రుణమాఫీ సొమ్ము ఎంత? రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన రుణమాఫీ ఎంత అనే తేడా చూడాలని కోరారు. ఫామ్‌హౌస్ పాలన కోరుకునేది దొరలు మాత్రమేనన్నారు. కెటిఆర్, హరీశ్‌రావు, కల్వకుంట్ల కవిత రాజకీయ ముఖచిత్రంలో తమ అస్థిత్వం కోసం విమర్శలు చేస్తున్నారని విమర్శించారు.

సబ్సిడీతో టెర్రస్ గార్డెన్లను ప్రమోట్ చేస్తున్నాం

- 17వ గ్రాండ్ నర్సరీ మేళాను ప్రారంభించిన మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పట్టణ ప్రాంతాల్లో ప్రజలు చెట్లు పెంచుకునేలా సబ్సిడీ అందిస్తూ ఈ ఏడాది నుంచీ టెర్రస్ గార్డెన్లను ప్రమోట్ చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో 17వ గ్రాండ్ నర్సరీమేళా పేరుతో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హార్టికల్చర్ షోను గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పట్టణంలో పెద్దఎత్తున రూఫ్ గార్డెన్స్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రజలు ఏమాత్రం ఖాళీ స్థలం ఉన్నా కూరగాయలతోపాటు పచ్చదనం కోసం మొక్కలు పెంచాలని సూచించారు. పట్టణ ప్రాంత ప్రజలు ఉదయం నుంచి ఉద్యోగాలు చేసి స్ట్రెస్‌కు గురవుతారని, సాయంత్రం ఇంటికి వెళ్లి టెర్రస్‌పై కూర్చుంటే ఆహ్లాదంగా గడిపేందుకు గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఎంత స్థలం ఉంటే అన్ని మొక్కలు పెంచుకొని పచ్చదనాన్ని పెంపొందించడం ఉపయోగమని చెప్పారు. మానవ జీవితానికి, మనుగడకు పచ్చదనం కావాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మొక్కలు పెంచడం అనివార్యం అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలా అయితే వ్యవసాయ క్షేత్రాలు ఉంటాయో అలాగే పట్టణ ప్రాంత ప్రజలు వీలైనంత ఎక్కువగా గ్రీనరీ పెంచుకోవాలన్నారు. వ్యవసాయం చేసుకునే వారికి ఏ జబ్బులు రావన్నారు. పొల్యూషన్ నుంచి ఉపశమనం పొందడానికి రూఫ్ గార్డెన్, వర్టికల్ గార్డెన్స్ ఇలా ఇంటినిండా మొక్కలు పెంచుకోవాలనే ప్రజల ఆకాంక్షను చూస్తున్నామన్నారు. నర్సరీ ప్రేమికుల కోసం దేశ, విదేశాల నుంచి అరుదైన మొక్కలు, విత్తనాలు తీసుకొచ్చి ఒక వేదికగా ఇక్కడ అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. నర్సరీమేళా ఇన్‌చార్జి ఖలీద్ అహ్మద్ మాట్లాడుతూ.. ఈ మేళాలో దేశ విదేశాల నుంచి 150 స్టాళ్లలో అందమైన పూలమొక్కలు తక్కువ ధరతో పాటు లక్షల రూపాయల ఖరీదైన మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.కిచెన్ గార్డెన్, ఆర్నమెంటల్ ప్లాంట్స్, మెడిసినల్ ప్లాంట్స్, చెట్లను పెంచడానికి కావాల్సిన మెటీరియల్‌ను ప్రమోట్ చేసే విధంగా ఎగ్జిబిట్ చేసినట్టు చెప్పారు.

మహాత్ముని విగ్రహానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్

మహాత్మునికి గవర్నర్, సిఎం నివాళులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్ లంగర్ హౌస్‌లోని బాపూఘాట్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సిఎం రేవంత్‌రెడ్డి ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. గాంధీజీ సూచించిన శాంతి, అహింసల ఆచరణే ఆయనకిచ్చే అసలైన నివాళి అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ ఆశయాల సాధనలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి జితేందర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు

- సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన ముత్తినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉన్నత విద్యలో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య సిఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం సిఎంను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. స్వయంగా సిఎం చేతుల మీదుగా వికలాంగురాలికి ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వులు ఇవ్వటం అభినందనీయమన్నారు. దీంతో సిఎం వికలాంగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. అందుకే ఆయన వికలాంగుల ఆత్మబంధువైనారని పేర్కొన్నారు. దావోస్ నుండి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి రూ.1,78,950 కోట్ల పెట్టుబడులను ఆకర్షించారని, తద్వారా 49,500 ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత రికార్డు స్థాయిలో గతేడాదితో పోలిస్తే నాలుగు రెట్లకు మించి పెట్టుబడులు తీసుకుని రావటం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సామర్థ్యం పెంపులో మరో ముందడుగు

- హిమాచల్‌ప్రదేశ్ హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్టులపై ఆసక్తి
- ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్‌తో డిప్యూటీ సిఎం భట్టి భేటీ

హిమాచల్ ప్రదేశ్ సిఎం సుఖ్వీందర్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సూచనలతో అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. హిమాచల్ ప్రభుత్వం బూట్ (బిల్డ్ ఆన్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) విధానంలో 22 హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలను ఆహ్వానించింది. ఆయా ప్రతిపాదనలపై అధ్యయనం చేసిన రాష్ట్ర విద్యుత్‌శాఖ అధికారుల బృందం 100 మెగావాట్లకు పైబడిన సామర్థ్యం గల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేసింది. ఈ క్రమంలో గురువారం ఢిల్లీలో హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సఖుతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం 400, 120 మెగావాట్ల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా అధికారికంగా ఒక లేఖను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్ట్ ముసాయిదాను పంపిస్తే ఒప్పందంపై తగిన పరిశీలన చేసిన త్వరితగతిన ఎంవోయూపై సంతకం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని భటి ఈ సందర్భంగా తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే హైడ్రోఎలక్ట్రిక్ విద్యుత్‌ను మన రాష్ట్రానికి సరఫరా చేస్తారు. ఫలితంగా ప్రస్తుత రాష్ట్ర అవసరాలు, భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్, సరఫరా సామర్థ్యం పెంచేందుకు మరింత ఉపయోగపడుతుందని సర్కార్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం హిమాచల్ ప్రభుత్వం ప్రతిపాదించిన హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులను దక్కించుకునేందుకు తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈ భేటీలో విద్యుత్ శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రెండో విడత స్పోర్ట్స్ గ్రాంట్ నిధులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో స్కూల్ గ్రాంట్ కింద రూ.36.11 కోట్లు, స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంట్ నిధులు రూ.12.25 కోట్లు కలిపి మొత్తం రూ.48.36 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు (ఎస్‌పీడీ) ఈవి నరసింహారెడ్డి గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. స్కూల్ గ్రాంట్, స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంట్ కింద 50 శాతం నిధులను గతంలో మొదటి విడతలో రూ.48.86 కోట్లు విడుదల చేశామని వివరించారు. ఇప్పుడు రెండో విడతలో రూ.48.36 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఇందులో ఎస్సీల (24 శాతం) కాంపొనెంట్ నిధులు రూ.11.60 కోట్లు, ఎస్టీల (14 శాతం) కాంపొనెంట్ నిధులు రూ.6.77 కోట్లు, జనరల్ కాంపొనెంట్ (62 శాతం) నిధులు రూ.29.98 కోట్లు కలిపి మొత్తం రూ.48.86 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 25,760 ప్రభుత్వ పాఠశాలలున్నాయని వివరించారు. వాటికి స్కూల్ గ్రాంట్ కింద వంద శాతం నిధులు రూ.72.22 కోట్లు విడుదల చేశామని తెలిపారు. స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంట్ కింద 25,760 స్కూళ్లకు వంద శాతం నిధులు రూ.24.50 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు.

IN THE COURT OF THE V ADDL. DISTRICT AND SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT, AT :: L.B. NAGAR
I.A. NO. 11 OF 2023
IN
O.S. NO. 1110 OF 2015

BETWEEN:
SMT. T. SHOBHA DEVI ... PETITIONER/ PLAINTIFF
AND
Smt. T. Padma And 155 others ... RESPONDENTS/ DEFENDANTS

To,
49) Dr. Chintoj Akhila, D/o. Dr. Shankar Aged about: 29 years, Occ: Doctor
50) Dr. Chintoj Archana, D/o. Shankar Aged about 25 years, Occ: Doctor
(R49, R50 are R/o. H.No.12-6, Mustabad, Karimnagar, Telangana State).
52) Mr. Bureddy Dharma Reddy, S/o. Bureddy Venkat Reddy Aged about 50 years, Occ: Employee, R/o. Flat No.107, H.No.2-3-671/1, Sai Nilayam Apts, Sai Nagar Road No.1, Near Swagath Grand Hotel, Chanikayapuri, Nagole, Hayathnagar, K.V Rangareddy, Telangana 500068
53) Sri. Vivek Baheti, S/o. Purshotam Lal Baheti, Aged about 40 years, Occ: Business, R/o H.No.8-2-618/G/2/1/A, Road No. 11, Plot No. 25, Banjara Hills, Hyderabad, T.S.
54) Miss Chakinala Sudha, D/o. Sri Chakinala Siddi Rameshwar, Aged about 25 years, Occ: Student, R/o H.No:7-1-331, Mirchi Compound, Navatha Transport, Nizamabad, Nizamabad District, T.S-503001.
55) Sri Kudmula Ajay Kumar, S/o. K.Rama Krishna Reddy, Aged about 43 years, Occ: Advocate
56) Smt. Samreddy Agnihotri, W/o. Sri K.Ajay Kumar, Aged about 35 years, Occ: Self Employee (R55, R56 are R/o. H.No.16-2-752/21/50, Triveni Nagar Colony, Gaddiannaram, Hyderabad-500060, Telangana State).
57) Gujjeti Sandeep, S/o. Gujjeti Ashok, Aged about 28 years, Occ: Pvt. Employee
58) Gujjeti Pratyusha W/o.Gujjeti Sandeep, Aged about 28 years, Occ: House Hold (R57, R58 are R/o.6-26/A, Thimmapur Mandal, Thimmapur, Karimnagar, T.S)
59) Dr. Chintoj Akhila, D/o. Shankar, Aged about 29 years, Occ: Doctor, R/o. H.No.12-6, Mustabad, Karimnagar, Telangana State.
60) Sri Sama Jyothishwar Reddy, S/o. Sri Sama Damodhar Reddy, Aged about 42 years, Occ: Service, R/o. Flat No. 103, Block-F. Keerthi Apartments, Behind Sarathi Studio, Yellareddyguda, Ameerpet, Hyderabad.
61) Sri Sama Shankar Reddy S/o. Late S. Yadagiri Reddy, Aged about 42 years, Occ: Business, R/. H.No.22-14/2, V.V Nagar Colony, Dilsukhnagar, Hyderabad-60, Presently residing at 10482, Sheridan Cres NE, Redmond, WA, 98053, U.S.A.
62) Sri. Praveen Gunda, S/o. Sri Rami Reddy Gunda, Aged about 37 years, Occ: Pvt. Employee, R/o. K.V Bazara, Khammam, Raghunadhapalem, Erlapudi, Khammam, Telangana.
63) Smt. Kavitha Yeligireddy, W/o. Sri. Praveen Gunda, Aged about 36 years, Occ: House wife, R/o. H. No.2-43, Kagitharamachandrapuram, Nalgonda, Nadigudem, Kagitha Rama Chandrapuram, Nalgonda, T.S.-508234.
64) Sri. Sama Mohan Reddy, S/o. Sri. S. Yadagiri Reddy, Aged about 45 years, Occ: Business
65) Smt. Sama Vasumathi Alias @ Komatireddy Vasumathi, W/o. Mr. Sama Mohan Reddy, Aged about 41 years, Occ: House Wife (R64, R65 are Rio. Flat No.305. A-Block, Himasai Poojitma Apartments, Doctors Colony, Kothapet, Hyderabad)
66) Sri. Chandrakanth Chilumula, S/o Sri Malla Reddy Chilumula, Aged about 36 years, Occ: Software Engineer, R/o, Flat No.602, Block-V, My Home Vihanga, Gachibowli, Hyderabad- 500032.
67) Mr. Modugu Vikram, S/o. Sri Modugu Sudhakar Reddy, Aged about 35 years, Occ: Software Engineer, R/o. H.No.6-61/4, Kethepally Mandal, Kasangode, Bopparam, Nalgonda District, Telangana
68) G. Vijay Kumar, S/o. G. Ashwantha Narayana, Aged about 54 years, Occ: Business, R/o. Flat No.409, PDR Apts, Beside Naidu's Colony, Upperpally Village, Rajendranagar Mandal, Rangareddy District, T.S.
69) A.Shushankar, S/o. Sri. Mohan Rao, Aged about 51 years, Occ: Business, R/o. H.No.10-2-289-120, Shanti Nagar, Masab tank, Hyderabad, TS
70) SMR. Developers Pvt. Ltd., Rep by Smt. S. Savithri, W/o. Late Sri. S. Chenna Reddy, Aged about 51 years, Occ. Managing Director, R.o. Plot No. 73, Nagarjuna Hills, Panjagutta, Hyderabad.
71) Sri Prabhakar Chary, S/o. Late Sri Agamaiah Chary, Aged about 36 years, Occ: Business
72) Sri. Gopal Chary, S/o. late Sri Agamaiah Chary, Aged about 51 years, Occ: Govt. Service
73) Sri Narender Chary, S/o. Late Sri Agamaiah Chary, Aged about 28 years, Occ: Business
74) Sri. Ramesh Chary, S/o, late Sri Agamaiah Chary, Aged about 26 years, Occ: Business (71 to 74 are R/o. H.No.3-59, Manchirevula Village, Rajendranagar Mandal, Rangareddy District)
75) Sri. Tummanuri Sreekar Reddy, S/o. T. Ramachandra Reddy, Aged about 36 years, Occ: Agriculture, R/o. Manchirevula Village, Rajendranagar Mandal, Rangareddy District.
76) R. Sunitha, W/o. R. Sai Reddy, Aged about 40 years, Occ: House Wife, R/o.H.No.4-18, Machirevula Village, Rajendranagar Mandal, Rangareddy District.
77) A. Sujatha, W/o. A. Buchi Reddy, Aged about 35 years, Occ: House Wife, R/o H.No.4-18, Machirevula Village, Rajendranagar Mandal, Rangareddy District.
78) L. Venkata Reddy, S/o. Late L. Chinna Malla Reddy, Aged about 55 years, Occ: Agriculture, R/o. H.No.4-18, Machirevula Village, Rajendranagar Mandal, Rangareddy District.
79) L. Prakash Reddy, S/o L. Venkat Reddy, Aged about 35 years, Occ: Agriculture, R/o. H.No.4-18, Machirevula Village, Rajendranagar Mandal, Rangareddy District,
80) S. Mounika, W/o. S. Madhusudhan Reddy, Aged about 34 years, Occ. House Wife, R/o. H.No.4-18, Machirevula Village, Rajendranagar Mandal, Rangareddy District.
81) B. Lavanya @ Indu, W/o. Sri. Krishna Reddy, D/o. L. Venkat Reddy, Aged about 32 years, Occ: Housewife, R/o. H.No. 4-18, Machirevula Village, Rajendranagar Mandal, Rangareddy District
82) K. Praveen Chary, S/o. Vitallaiah Chary, Aged about 31 years, Occ: Business, R/o, H.No.3-57, Machirevula Village, Rajendranagar Mandal, Rangareddy District.
83) K. Yadagiri Chary, S/o. Vitallaiah Chary, Aged about 37 years, Occ: Business, R/o. H.No.3-57, Machirevula Village, Rajendranagar Mandal, Rangareddy District.
84) K. Srinivasa Chary, S/o. Vitallaiah Chary, Aged about 34 years, Occ: Business, R/o. H.No.3-57, Machirevula Village, Rajendranagar Mandal, Rangareddy District
90) L. Mahender Reddy, S/o. L. Veera Reddy, Aged about 27 years, Occ:. Business, R/o. H.No.4-28, Machirevula Village, Rajendranagar Mandal, Rangareddy District.
91) L. Balwant Reddy, S/o. L. Veera Reddy, Aged about 26 years, Occ: Business, R/o. H.No.4-28, Machirevula Village, Rajendranagar Mandal, Rangareddy District.
92) Gotke Rajashekar, S/o. G. Siddhi Ramappa, Aged about 45 years, Occ. Agriculture, R/o SRT 382, Jawaharnagar, Chikkadpally, Hyderabad.
93) Sri. Yash Kumar, S/o. Sri Hemant Kumar, Aged about 27 years, Occ: Business, R/o. H.No.21-7-621, Chelapura Road, Hyderabad-500002.
99) Tripuram China Reddy, W/o. Late T. Bakki Reddy, Aged about 47 years, Occ: Business, R/o. Villa No.24, Alluri Medows, White Field, Kondapur, Hyderabad.
100) T. Prasanna Rani, W/o. Late T. Satyanandam, Aged about 43 years, Occ: House Wife, R/o.H.No.11-5-183/A, Road No.1 Venkateswara Colony, Saroornagar, Hyderabad.
101) K. Siva Prasad, S/o. K. Butchi Prakasa Rao, Aged about 46 years, Occ: Business, R/o Flat No 402, Aakruthi Annex, Street 4, Czech Colony, Sanath Nagar, Hyderabad.
102) Sama Shekhar Reddy, S/o. S. Damodar Reddy, Aged about 47 years, Occ: Business, R/o, Flat No.403, Pinnacle Pride, Uma Nagar, Begumpet, Hyderabad.
104) Sri Kudumula Ajay Kumar, S/o. K. Ramakrishna Reddy, Aged about 43 years, Occ: Advocate, R/o. H.No. 16-2-752/21/50, Triveni Nagar Colony, Gaddianaram, Hyderabad-500060.
104) Sama Reddy Agnihotri, W/o. K. Ajay Kumar, Aged about 35 years, Occ: Self Employee, R/o. H.No. 16-2-752/21/50 Triveni Nagar Colony, Gaddianaram, Hyderabad-500060.
105) Vivek Baheti, S/o. Purshotam Lal Baheti, Aged about 40 years, Occ: Business, R/o. H.No.8-2-618/G/2/1/A, Road No. 11, Plot No 25, Banjara Hills, Hyderabad. T.S
106) Sreekanth Ganganakurthi, S/o. Ganganakurthi Suri Babu, Aged about 32 years. Occ: Pvt Employee, R/o. Flat No.402, Alekhya Mulberry Apts, Sai Aishwarya Layout, Khajaguda, New Delhi Public School, Hyd.
107) Bureddy Dharmareddy, S/o. Bureddy Venkat Reddy, Aged about 50 years, Occ: Employee, R/o. Flat No.107, H.No.2-3-671/1 Sai Nilayam Apts, Sai Nagar, Road No.1 Near Swagath Grand Hotel, Chanikyapuri, Nagole, Hayathnagar, Rangareddy TS 500068.
108) Madireddy Prasanth Reddy, S/o. Krishna Reddy Madireddy, Aged about 35 years, Occ: Employee, R/o H.No. 20-141, R.B Nagar, Shamshabad, Hyderabad, TS 501218
112) Nutheti Kiran Kumar S/o. Nutheti Srinivasulu, Age about 43 years, Occ: Pvt. Employee, R/o H.No. 16-31-393-395, Flat No. 305, Phase 6, KPHB Colony, Kukatpally, Hyderabad, T.S.
112) Nutheti Bhavani Swapna, W/o. Nutheti Kiran Kumar, Aged about 39 years, Occ: House Wife, R/o. H.No. 16-31-393-395, Flat No. 305, Phase 6, KPHB Colony, Kukatpally, Hyderabad, T.S.
114) Union Bank of India, Ashok Nagar Branch, Hyderabad (Doc No.4559/2021)
115) Anusha Thota, W/o. Thota Harinath Rao, Aged about 44 years, Occ: House Wife, R/o Plot No. 196, Sripuram colony, Malakpet, Hyderabad.
116) Kodumagulla Sharada, W/o. Kodumagulla Srinivasa Chary, Aged about 38 years, Occ: House Wife, R/o. H.No. 8-3-222/G-31/2-A, 2 nd Floor, Srinivasam Apt, Madhura Nagar, Yousufguda, Ameerpet, Hyderabad T.S-500038.
117) Mood Yashoda Bai, W/o. Bukkai Adi Reddy, R/o. Flat No.702, A-Block, Reserve Bank Senior Officer Quarters, Tata Mills Compound, Hindmata, Dadar East Mumbai 40014.

Please take notice that, the Pet/Plaintiff has filed I.A. No 11 of 2023 in O.S 1110 of 2015 to implead you Nos.49, 50, 52 to 84, 90 to 93, 99 to 102, 104 to 108, 112, 114 to 117 in above IA. The Hon'ble Court was pleased to order for substitute service summon against you Nos.49, 50, 52 to 84, 90 to 93, 99 to 102, 104 to 108, 112, 114 to 117 by way of publishing in the Praja Shakti Telugu daily in Hyderabad Edition. Kindly appear on 11-02-2025 at 10.30 AM before the above-mentioned Hon'ble Court. The above I.A. is posted for your appearance either personally or through advocate, failing which the Hon'ble Court will pass appropriate order in accordance with law.

BY ORDER OF THE COURT.

Sd/-
T.BHEEM REDDY.
Advocate
#3-5-20, Opp Navjeevan Women's College, Ram Koti, Hyderabad-01
Cell No: 9440059706

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్ 326/2023

సయ్యద్ ఖమురున్నిసా వగైరాలు ..వాదులు
వర్సస్
షేక్ మదార్ బి వగైరాలు .. ప్రతివాదులు

To
ప్రతివాదుల చిరునామా
D-1)షేక్ మదార్ బి భర్త లేట్ ఖలీల్ అహ్మద్, కేరాఫ్ షేక్ గౌసియా, 202ఎ, డి బ్లాక్, స్లెండర్ అపార్ట్మెంట్స్, గాజులరామారం, యు.ఎం.సి.సి .దగ్గర , వీటిసి, కుత్బుల్లాపూర్, తెలంగాణ స్టేట్.
D-4) షేక్ గౌసియా, భర్త సమీర్ బాబు, 202ఎ, డి బ్లాక్, స్లెండర్ అపార్ట్మెంట్స్, యు.ఎం.సి.సి. దగ్గర, వీటీసీ, కుత్బుల్లాపూర్, తెలంగాణ స్టేట్.

పై వాదులు దావా షెడ్యూల్ ఆస్తులను భాగ పంపకములు చేయు నిమిత్తము మీ వగైరాలపై , పై నెంబరు దావా దాఖలు చేయగా కోర్టు వారు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపినను తీసుకొనక తప్పించుకొని తిరుగుచున్నారు. కావున కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా జారి చేయమని ఆర్డర్ వేసి ఉన్నారు. కావున మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల 21-02-2025 తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలను. లేని ఎడల మీ పరోక్ష మందు విమర్శ చేసి తీర్మా నింపబడునని ఖండితముగా తెలియజేయడమైనది

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 21-02-2025

ఇట్లు
సయ్యద్ అలీ జహీర్,
కే.సత్య సులోచన,
వాదుల తరపు అడ్వొకేట్స్.
సెల్ నెం: 9490281499, 9490040889

సాయుధ పోరాటం స్ఫూర్తితో ముందుకెళ్తాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్యను హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఉన్న ఆయన నివాసానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ ఎన్నికయ్యారంటూ చుక్కా రామయ్యకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్, కంట్రోల్ కమిషన్ చైర్మెన్ డిజి నరసింహారావు వివరించారు. జాన్‌వెస్లీ డివైఎఫ్‌ఐ, కెవిపిఎస్‌లో పనిచేశారంటూ గుర్తు చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీకి రామయ్య మిఠాయి తినిపించి శుభాకాంక్షలు చెప్పారు. వెళ్తున్నామని చెప్పగానే 'మంచిది'అంటూ చుక్కా రామయ్య సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో జాన్‌వెస్లీ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఉద్యమాలకు పూనుకుంటామని చెప్పారు.

భుజంగరావు, రాధాకిషన్ రావులకు బెయిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఉన్న మాజీ అదనపు ఎస్పి భుజంగరావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావుకు బెయిల్ మంజూరైంది. తెలంగాణ హైకోర్టు గురువారం వీరికి బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష చొప్పున 2 ష్యూరిటీలు, పాస్‌పోర్టులు సమర్పించాలనీ, దేశం విడిచి వెళ్లరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని హైకోర్టు వారికి స్పష్టం చేసింది.

మహాత్మా గాంధీకి మంత్రి దామోదర నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం నివాళులు అర్పించారు. మహాత్ముడు చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను అందరూ ఆదర్శంగా తీ సుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు."ఆరోగ్యమే మహాభాగ్యం" అని గాంధీ చెప్పిన మాటలను మంత్రి గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యమైన జీవనశైలి అలవర్చుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి గుర్తు చేశారు. దేశ చరిత్రలో అత్యంత ప్రముఖమైన ఆస్పత్రుల్లో ఒకటిగా ఉన్న ఉస్మానియా హాస్పిటల్ కోసం కొత్త భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ నెల 31న (నేడు) కొత్త ఉస్మానియా భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోబోతున్నామని తెలిపారు.

మిర్చి రైతు నష్టపోయిన పాపం సర్కారుదే..

- క్వింటాలును రూ.25 వేలకు కొనుగోలు చేయాలి
- లేదంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు దిగుతాం : మూడ్ శోభన్

నిరసన తెలుపుతున్న మూడ్ శోభన్ తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మిర్చి ధర దయనీయ స్థితికి పడిపోవడానికి రాష్ట్ర సర్కారు అవలంభిస్తున్న విధానమే కారణమని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ విమర్శించారు. మహబూబాబాద్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌ను ఆయన గురువారం సందర్శించారు. భారీ ఎత్తున అమ్మకానికి తరలివచ్చిన మిర్చి బస్తాల నడుమ నడుచుకుంటూ మార్కెట్ అంతటా కలియ తిరిగారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వివిధ ప్రాంతాల నుంచి మిర్చిని అమ్మకానికి తెచ్చిన రైతులతో మాట్లాడి వారి గోడును స్వయంగా విన్నారు. ఈ సందర్భంగా మూడు శోభన్ మాట్లాడుతూ.. మిర్చి ధరలు తగ్గడానికి ఉత్పత్తి పెరగడమో, అంతర్జాతీయ మార్కెట్‌లో ధర తగ్గడమో కారణం కానేకావని స్పష్టంచేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కారు పాపమేనని విమర్శించారు. ఎకరాకు 35-40 క్వింటాలు సాధారణ దిగుబడి వచ్చేదని, ఇప్పుడు 15-25 క్వింటాలు మాత్రమే వస్తోందని అన్నారు. ఎకరాకు రూ.1.5 లక్షల పెట్టుబడిని మిరప పంటపై ధార పోశారని, ప్రస్తుతం మార్కెట్‌లో ధర చూస్తే కంటిపై కునుకు కూడా రావడం లేదని తెలిపారు. ప్రభుత్వంపై పోరాడి మద్దతు ధర సాధించుకోవాలన్నారు. గతేడాది క్వింటా మిర్చి ధర రూ.24 వేలు పలికిందని, ప్రస్తుతం రూ.13వేలకు కూడా కొనుగోలు చేసే దిక్కులేకపోవడం దారుణమన్నారు. జిల్లాలో మిర్చి ధర దారుణంగా పతనమైందని, వ్యాపారులు, దళారులతో అధికారులు కుమ్మక్కై మిర్చి రైతును చిత్తు చేస్తున్నారని విమర్శించారు. కనీస మద్దతు ధర లేక పంటను కోల్డ్ స్టోరేజీలో దాచుకుందామన్నా అందులోనూ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లే తిష్ట వేస్తున్నారని ఆరోపించారు. అప్పులబాధతో మిర్చి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, రైతుల కష్టాలు, కన్నీళ్ల గురించి ఏ ఒక్కరూ మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దళారీ వ్యవస్థను నివారించడంతో పాటు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజీల్లోనూ తనిఖీలు నిర్వహించి రైతుల పంట మాత్రమే నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిర్చి ధర విషయంలో రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, లేదంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కనీస మద్దతు ధర కల్పించేందుకు తక్షణమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి మిర్చిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టి వెంకన్న, అధ్యక్షులు గునిగంటి రాజన్న, జిల్లా ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్, పల్లా ప్రభాకర్ రెడ్డి, బయ్యా సోమన్న, నిరుటి జలంధర్, కట్ల కృష్ణయ్య, బానోత్ రమేష్, వెంకన్న, కులగుజ్జు రాంమూర్తి, ఆంగోత్ ఇస్లా, రామసాని రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు కాల్

- ఫోన్ చేసిన వ్యక్తి మతిస్థిమితం లేని వానిగా గుర్తింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పేల్చి వేస్తామని గురువారం బెదిరింపు కాల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫోన్ చేసి బెదిరించిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి ఎయిర్‌పోర్టును పేల్చి వేస్తామని బెదిరింపు కాల్ చేశాడు. దాంతో పోలీసు అధికారులు ఎయిర్‌పోర్టులోని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో ఫేక్ కాల్‌గా పోలీసులు నిర్ధారించారు. ఫేక్ కాల్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అతను కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని గుర్తించారు. అనంతరం నిందితుడిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అన్ని అర్హతలు కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయని, వెంటనే ఏర్పాటుచేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని జెఎసి ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలోని గాంధీ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో సహా పలువురు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు ప్రాంతాలను రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేశారని, చేర్యాల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంతంలో ఉన్న పోలీసులు కూడా ఈ ప్రాంత ప్రజల మనోభావాలకు విలువనిస్తూ రెవెన్యూ డివిజన్‌కి సహకరించాలన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న అన్ని వర్గాల ఏకైక కోరిక చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయడమే అని, ఈ ప్రాంతంలో పుట్టిన బిడ్డగా చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం ఈ ప్రాంత పోరాట యోధుల స్ఫూర్తితో శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ.. చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం ఎనిమిదేండ్లుగా పోరాటం జరుగుతుందని అన్నారు. కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాలకు మధ్యలో ఉన్న మండలం చేర్యాల కావడంతో ఇది రెవెన్యూ డివిజన్ అయితే అన్ని మండలాలకు అనుకూలంగా ఉంటుందన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్‌కు ఈ ప్రాంత కాంగ్రెస్ వాళ్లే అడ్డుకున్నారన్నారు. రెవెన్యూ డివిజన్ కోసం ప్రభుత్వ మేడలు వంచి వచ్చేదాకా పోరాడతామన్నారు. రెవెన్యూ డివిజన్ కోసం త్వరలోనే చేర్యాలను పూర్తిస్థాయిలో బంద్ చేస్తామని, వంట వార్పు చేస్తామని, అవసరమైతే ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయని, చేర్యాలను అప్పటిలోపు రెవెన్యూ డివిజన్ చేయకపోతే స్థానిక సంస్థల్లో ఒక వార్డు మెంబర్ కూడా గెలవనిచ్చే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కెఎల్ఎన్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధి కూలీల మరణం దిగ్భ్రాంతికరం

- బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు ఉపాధి హామీ కార్మికులు మరణించడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఘటన వార్త తెలిసిన వెంటనే జిల్లా డీఆర్డీఓను ఘటనాస్థలికి పంపించారు. ప్రమాదంపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెప్పించుకున్నారు. ప్రమాదం జరిగే అవకాశం ఉన్న ఆ ప్రాంతంలో పనులు చేయొద్దని జిల్లా అధికారులు వారం క్రితమే హెచ్చరించినా...పనులు కొనసాగడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై శాఖ అధికారులతో సమగ్ర విచారణకు ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. మరణించిన, గాయపడిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇద్దరు కార్మికులు మరణించడం బాధాకరం : మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట జిల్లా గోవర్ధనగిరిలో ఇద్దరు ఉపాధి హామీ కార్మికులు పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు మరణించడం బాధాకరమని ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఘటన పై సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి తో ఫోన్లో మాట్లాడి, దుర్ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఉపాధి హామీ చట్టం కింద నిబంధనల ప్రకారం కూలీలకు అందించాల్సిన ఆర్థిక సహాయం, ఇతర సహకారాలపై చర్చించారు. క్షతగాత్రుల కోరిక మేరకు వారికి ఇష్టమున్న చోటే వైద్య సౌకర్యం పొందేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తీవ్రంగా గాయపడి వరంగల్ జిల్లా ఎంజిఎం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న స్వరూప ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఎంజిఎం హాస్పిటల్ సూపరింటెంట్ కిశోర్‌తో ఫోన్లో మాట్లాడి ఆమెకు అందుతున్న వైద్యం పై గురించి అడిగి తెలుసుకున్నారు.

మార్చ్‌లో నథింగ్ ఫోన్ (3ఎ) సిరీస్ విడుదల

న్యూఢిల్లీ : లండన్ కేంద్రంగా పని చేస్తోన్న టెక్నాలజీ కంపెనీ నథింగ్ తన ఫోన్ (3ఎ) సిరీస్‌ను మార్చ్ 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. గొప్ప ఆకాంక్షలు, అత్యాధునిక ఆవిష్కరణలు, ప్రాసెసర్లు కోరుకునే వారికి ఇది మంచి అనుభవాన్ని ఇవ్వనుందని ఆ సంస్థ పేర్కొంది. అటువంటి వారిని దృష్టిలో పెట్టుకునే కెమెరా, స్క్రీన్, ప్రాసెసర్, డిజైన్ అంశాల్లో కీలక దృష్టిని కేంద్రీకరించామని పేర్కొంది. 2020 అక్టోబర్‌లో ప్రారంభించిన తమ కంపెనీ నాలుగేళ్లలోనే బిలియన్ డాలర్ల సంస్థగా అవతరించిందని నథింగ్ పేర్కొంది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభాలు 97 శాతం పతనం

న్యూఢిల్లీ : గౌతం అదానీకి చెందిన కీలక కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభాలు భారీగా పతనమయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఏకంగా 97 శాతం పతనమై రూ.58 కోట్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.1,888 కోట్ల నికర లాభాలు సాధించింది. డాలర్‌తో ఆస్ట్రేలియం మారకం విలువ పడిపోవడంతో అక్కడి మైనింగ్‌లో రాబడులు తగ్గినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ పేర్కొంది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 9 శాతం తగ్గి రూ.22,848 కోట్లుగా చోటు చేసుకుంది. పేలవ ఫలితాలను ప్రకటించిన నేపథ్యంలో గురువారం ఓ దశలో ఆ కంపెనీ షేర్ 9 శాతం మేర పతనమయ్యింది. తుదకు 2.85 శాతం తగ్గి రూ.2,252.65 వద్ద ముగిసింది.

కార్యక్రమంలో మాట్లాడుతున్న చావ రవి

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని గురుకులాలు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయ, అధ్యాపకులకు జీరో వన్, జీరో పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి డిమాండ్ చేశారు. గురువారం మహబూబాబాద్ జిల్లా మహాత్మా జ్యోతిబాపూలే బిసి వెల్ఫేర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాలను ఒకే మేనేజ్‌మెంట్ కిందకు తీసుకురావాలని అన్నారు. అసంబద్ధమైన పనివేళలను మార్చాలని, ఆరోగ్య కార్డులు ఇచ్చి కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలని తెలిపారు. ప్రిన్సిపల్, అధ్యాపకులకు గెజిటెడ్ హోదా కల్పించాలని అన్నారు. మోడల్ స్కూల్స్‌లో రెండవ ఫేజ్‌లో నియామకమైన ఉపాధ్యాయులకు సర్వీసును నోషనల్‌గా పరిగణిస్తూ వేతన స్థిరీకరణ చేయాలన్నారు. పదోన్నతులు చేపట్టాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. కేర్ టేకర్లను నియమించి ఉపాధ్యాయులపై పని భారం తగ్గించాలన్నారు. కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ చెల్లించాలని, వివిధ సెలవులు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కుబేర్‌లో పెండింగ్ జిపిఎఫ్ రుణాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలు క్లియర్ చేయాలని అన్నారు. పెండింగ్ ఐదు డిఎలు ప్రకటించాలని, పీఆర్సీ నివేదిక తెప్పించుకొని 30 శాతం ఫిట్మెంట్ తగ్గకుండా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని అమలు చేయొద్దని, ప్రీ ప్రైమరీ తరగతులను అంగన్‌వాడీలో కలపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎ మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ లాంగ్వేజ్ సబ్జెక్టులకూ అభ్యాస దీపికలు ఇవ్వాలి

- సమగ్ర శిక్ష ఎఎస్‌పిడి రాధారెడ్డికి టిఎస్‌జిహెచ్‌ఎంఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమగ్ర శిక్ష ఎఎస్‌పిడికి వినతి పత్రం అందజేస్తున్న టిఎస్‌జిహెచ్‌ఎంఎ నాయకులు

రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన లాంగ్వేజ్ సబ్జెక్టులకూ అభ్యాస దీపికలను అందించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టిఎస్‌జిహెచ్‌ఎంఎ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో సమగ్ర శిక్ష ఎఎస్‌పిడి ఎం రాధారెడ్డిని గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రాజగంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ గిరిధర్‌గౌడ్, కోశాధికారి బి తుకారాం కలిసి వినతిపత్రం సమర్పించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి భాషేతర (నాన్ లాంగ్వేజ్) సబ్జెక్టులకు అభ్యాసదీపికలను అందిస్తున్నారని తెలిపారు. వాటి వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగం కలుగుతున్నదని వివరించారు. అదే విధంగా లాంగ్వేజ్ సబ్జెక్టులకు కూడా అభ్యాస దీపికలను అందించాలని కోరారు. దానివల్ల విద్యార్థులకు ఉపయోగం ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ప్రయోజనం కలుగుతున్న దృష్ట్యా విద్యాశాఖ వాటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ పాలనపై కవిత ధ్వజం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో భయంకరమైన రోజులు వచ్చాయని బిఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ దుష్పరిపాలన వల్ల తెలంగాణ వందేండ్లు వెనక్కివెళ్లిన పరిస్థితి తలెత్తిందని చెప్పారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, అబద్ధాలతో సిఎం రేవంత్ రెడ్డి కాలం వెళ్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధం అద్దం ముందు నిలబడితే రేవంత్ రెడ్డి బొమ్మ కనబడుతుందని ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టి ఎక్కువకాలం పరిపాలించలేరని స్పష్టం చేశారు. అలవిగాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. గురవారం నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆమె.. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసీ తెలియక హామీలిచ్చామని స్వయంగా అసెంబ్లీ స్పీకర్ అన్నారని గుర్తు చేశారు. 130 ఏళ్ల చరిత్ర ఉందని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఎలా మోసం చేస్తుందని ప్రశ్నించారు. చేతిలో ఎర్రబుక్కు పట్టుకొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణ పరిస్థితులపై ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ చరిత్ర మొత్తం మోసాల చరిత్ర, దగా చరిత్ర అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా, రేషన్ కార్డులు ఎవరికి ఇస్తున్నారో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందని, సచివాలయంలో ఏసి గదుల్లో కూర్చొని తయారు చేసిన లబ్దిదారుల జాబితాను గ్రామాల్లోకి తీసుకొచ్చి చదువుతున్నారని వివరించారు. ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధికారులను నిలదీస్తే అది తుది జాబితా కాదని మాటమారుస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చే ఆలోచనతో ఉందని అనుమానం వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ అర్హులైన అందరికీ పారదర్శకంగా పథకాలను అందించారని, కేసీఆర్ హయాంలో నేరుగా లబ్ధిదారులకే కోట్లాది రూపాయలు వెళ్లాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన పనులను తామే చేశామని చెప్పడమే తప్పా ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని విమర్శించారు.

యూరియా కోసం రైతులు మళ్లీ లైన్లు కట్టే పరిస్థితి వచ్చిందని, కరెంటు ఎప్పుడొస్తుందా ఎప్పుడు పోతుందా అన్నది తెలియని దుస్థితి ఏర్పడిందని, చెరువులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు నీళ్లిచ్చే కాళేశ్వరం ప్యాకేజీ 21 పనులు పూర్తి చేయని చేతగాని ప్రభుత్వం అని అన్నారు. పెన్షన్ మొత్తాన్ని పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, కెసిఆర్ హయాంలో ఇచ్చినంతనే ఇంకా ఇస్తున్నారని అన్నారు. 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలను స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

ఎల్లారెడ్డి పాఠశాలలో విషాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. కేసీఆర్ పెట్టిన గురుకులాలను కూడా నడపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదని విమర్శించారు. తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని, ప్రభుత్వం తక్షణమే మొద్దు నిద్రవీడి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పసుపు పంట మార్కెట్‌కు వస్తున్న నేపథ్యంలో కనీస మద్దతు ధర ప్రకటించడానికి కేంద్రంలోని బీజేపీ సర్కార్ తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు బిజెపి ఎంపి ధర్మపురి అరవింద్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో పాటు బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టివివిపి ఆస్పత్రుల కాంట్రాక్ట్ సిబ్బందికి

జీతాలు చెల్లించకపోతే సమ్మె

- ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) ఆస్పత్రుల కాంట్రాక్ట్ సిబ్బందికి జీతాలు చెల్లించకపోతే ఫిబ్రవరి మొదటివారం నుంచి సమ్మెలోకి వెళతామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు నెలలుగా జీతాలు లేక టివివిపి ఆస్పత్రుల్లో పని చేయుచున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు విలవిలలాడుతున్న ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. జనవరి 23న కార్మికుల జీతాలు చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అధికారులకు వినతిపత్రం అందజేసి నిరసన కార్యక్రమాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమని వారు విమర్శించారు. జనవరితో ఏడో నెల కూడా పూర్తవున్నా... జీతాలు రాలేదని తెలిపారు.

ఎటిపిపిలో 'కేటుగాళ్లు' !?

- నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు
- జెన్కో విజిలెన్స్ అధికారుల విచారణ ?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో నకిలీ సర్టిఫికెట్లతో కొందరు ఉద్యోగాలు చేస్తూ ప్రభుత్వాన్ని, జెన్కోను మోసం చేస్తున్న సంఘటన చోటుచేసుకుంది. ఈ క్రమంలో కొందరు ఫిర్యాదు చేయడంతో హైదరాబాద్ జెన్కో విజిలెన్స్ అధికారులు బుధవారం, గురువారం విచారణ చేపట్టినట్టు సమాచారం. గణపురం మండలం చెల్పూర్ శివారు దుబ్బపల్లిలో మొదటి విడత 500, రెండో విడత 600 మెగావాట్ల ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్లాంట్ ప్రారంభంలో కెటిపిపి అధికారులు దుబ్బపల్లి, చెల్పూల్, కొంపెల్లి, మహబూబ్‌పల్లి తదితర గ్రామాల రైతుల నుంచి 1100 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ మొత్తం భూమిని 400మంది రైతులు కెటిపిపి ఏర్పాటుకు ఇచ్చారు. కెటిపిపిలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తున్నామని తెరపైకి రావడంతో 400 నుంచి ఒక్కసారిగా వెయ్యి మందికి చేరుకుంది. దాంతో జెన్కో అధికారులు అప్పుడున్న అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో ఉద్యోగ అవకాశాలు ఇచ్చారు. దాంతో కొందరు కేటుగాళ్లు మొదటి విడత 500, రెండో విడత 600 మెగావాట్ల ప్లాంట్‌లో కొందరు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా లాభం లేకుండా పోయింది. కెటిపిపిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు ఆరుగురు ఉద్యోగులు పదోన్నతి కోసం ఫేక్ సర్టిఫికెట్లను సంస్థకు అప్పగించినట్టు తెలిసింది. ఈ విషయమై ఫిర్యాదులు అందడంతో దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణకు ఆదేశించినట్టు సమాచారం. ఈ మేరకు విజిలెన్స్ బృందం బుధవారం, గురువారం రెండు రోజులపాటు భూపాలపల్లి ఎంఈఓ కార్యాలయంలో గంట పాటు విచారణ చేపట్టి పలు రికార్డులు పరిశీలించినట్టు తెలిసింది. ఈ విషయాన్ని జెన్కో ఉన్నతాధికారులు మాత్రం అధికారికంగా ధ్రువీకరించలేదు. విచారణ పూర్తయి నివేదిక అందిన తర్వాత పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉందని తెలిసింది. స్టేజ్ 1, స్టేజ్ 2 విద్యుత్ కేంద్రాల్లో చాలామంది నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరందరిని విజిలెన్స్ అధికారులు విచారణ చేపడితే నకిలీ కేటుగాళ్లు బయటపడే అవకాశం ఉంది. అంతేకాక నకిలీ కేటుగాళ్లకు గతంలో పనిచేసిన అధికారుల అండదండలతో ఈ ఉద్యోగాల్లో చేరి విధులు నిర్వహిస్తున్నారు. వీరి వద్ద అప్పుడున్న అధికారులు లంచాలు తీసుకొని ఉద్యోగాల్లోకి తీసుకున్నట్టు సమాచారం. గతంలో పనిచేసిన పెద్ద స్థాయి అధికారులు, వారి బంధువులు, స్నేహితుల పిల్లలు, వారి స్వగ్రామానికి చెందిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. బయటి వారికి ఉద్యోగాలు ఇవ్వడంతో స్థానికంగా ఉన్న వారికి ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది.

కులదురహంకార హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

- జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు తక్షణమే స్పందించాలి
- టి స్కైలాబ్‌బాబు, మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రేమ వివాహం చేసుకున్న వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటిని ఈ నెల 26న అత్యంత కిరాతకంగా హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి స్కైలాబ్‌బాబు, మల్లు లక్ష్మి అన్నారు. పౌర సమాజం మానవీయ కోణంలో ఈ హత్యను ఖండించాలని కోరారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో వడ్లకొండ కృష్ణ కుటుంబాన్ని సిపిఎం నాయకులతో కలిసి వారు పరామర్శించారు. హత్య గురించి కృష్ణ భార్య భార్గవి, తండ్రి డేవిడ్, సోదరి శ్వేతను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్లుగా ప్రేమించుకుంటున్న కృష్ణ, కోట్ల భార్గవి గతేడాది ఆగస్టు 7న నకిరేకల్ దేవస్థానంలో వివాహం చేసుకున్నారని అన్నారు. దీనిని జీర్ణించుకోలేని భార్గవి నాయనమ్మ బిక్షమమ్మ, సోదరులు నవీన్, వంశీ కక్షగట్టి కృష్ణను హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వరుసగా కుల దురహంకార హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ హత్యలను ఖండించకుండా ఉపేక్షిస్తుందన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తక్షణమే స్పందించి కృష్ణ కుటుంబాన్ని పరామర్శించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం ప్రకారంగా నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు వంశీ, నవీన్ ఆస్తులను ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బాధిత కుటుంబానికి అప్పగించాలని కోరారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరాకృతం కాకుండా చూడాలన్నారు. కులాంతర వివాహితులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు జరిపించి నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా చూడాలన్నారు. కృష్ణ కుటుంబానికి రేకుల ఇల్లు తప్ప వేరే నివాసం లేదన్నారు. తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లుగానీ, ఇందిరమ్మ ఇల్లుగానీ వారికి అందజేయాలని కోరారు. భార్గవికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాన్ని కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దెల దశరథ్, సామాజిక కార్యకర్త తెలంగాణ శ్యామ్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మర్రి నాగేశ్వరరావు, కోట గోపి, నాయకులు పరామర్శించారు.